క్లుప్తంగా

సేవకు అవకాశం ప్లీజ్!



చీర, పసుపు-కుంకుమను అందజేస్తున్న దుర్గ

శాంతిపురం: గత ఐదేళ్లుగా కుప్పం ప్రజల సేవలో మమేకమవుతున్న భరత్‌ను ఆశీర్వదించి మరింతగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి దుర్గ ప్రజలను కోరారు. శుక్రవారం ఆమె కర్లగట్టలో ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు చీర, పసుపు కుంకుమలను అందజేసి మాట్లాడారు. భరత్ కుప్పంలోనే నివాసం ఉంటున్నారని, కరోనా విపత్తు అతలాకుతలం చేస్తున్న రోజుల్లో చంద్రబాబునాయుడు కుప్పం ప్రజలకు ముఖం చాటేసినా భరత్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పనకు పాటుపడ్డారని, ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ



కళ్లద్దాలను అందజేస్తున్న డాక్టర్ జానకీరావు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 46మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు పంపిణీ చేశారు. జగనన్న కంటివెలుగు కార్యక్రమంలో ఇక్కడ ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపాలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ విగ్రహానికి స్థలం కేటాయించరూ!

పుంగనూరు: శాస్త్రవేత్త, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలామ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అయాబ్‌ఖాన్, నాగరాజ శుక్రవారం తహసీల్దార్ సీతారామన్‌కు వినతి పత్రం అందజేశారు. కలామ్ సమాజానికి ఆదర్శప్రాయులని, ఆయన భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండేందుకు విగ్రహం ఏర్పాటు చేయడం అవసరమన్నారు.

జూనియర్ రెడ్ క్రాస్ శాఖ ఏర్పాటు



పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని కల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి అన్నారు. హైస్కూల్లో శుక్రవారం జూనియర్ రెడ్‌క్రాస్ శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖ కౌన్సిలర్ వెంకటసిద్దులు మాట్లాడారు. రెడ్‌క్రాస్ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆపదలో ఉన్నవారిని కాపాడడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జానకీరావు, ఉపాధ్యాయులు రాజేంద్ర, ప్రకాష్, వేణుగోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఆగని గజదాడులు

వి.కోట: మండలంలో గురువారం రాత్రి నాగిరెడ్డిపల్లె, దానమయ్యగారిపల్లె, కుమ్మరమడుగు గ్రామాల్లోని పలువురు రైతుల అరటి, వరి, మొక్కజొన్న పంటలను 14 ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. దీంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి

సోమల: సమష్టిగా గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు అమాస కుసుమ కుమారి మాట్లాడారు. తొలుత మండల స్థాయి అధికారులు తమ శాఖల వారీగా ప్రగతిని నివేదించారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణమ్మ, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, ఎంపీడీఓ నాగరాజ, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నిఖిత (ఫైల్)

రొంపిచెర్ల: మహిళ అదృశ్యమైన సంఘటన కుమ్మరపల్లిలో శుక్రవారం జరిగింది. మహిళ తండ్రి కథనం మేరకు.. బండకిందపల్లె గ్రామ పంచాయతీ కమ్మోళ్లపల్లెకు చెందిన కిరణ్ కుమార్‌రెడ్డికి విశ్వనాథరెడ్డి కుమార్తె నిఖిత(22)తో 2021 ఫిబ్రవరిలో వివాహం చేశారు. అల్లుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 19న భార్యను ఆమె పుట్టింట్లో వదిలి, కిరణ్ కమ్మోళ్లపల్లెకు వెళ్లాడు. అయితే ఈనెల 22న నిఖిత ఇంటి నుంచి అదృశ్యమైంది. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ భరత్



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ

రామకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని నారాయణపురం తండా పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆయన ఎగుర వేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో భరత్ మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించిన ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు.రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో-కన్వీనర్ చంద్రారెడ్డి, పెద్ద తండా సర్పంచ్ మోహన్ నాయక్, పార్టీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, స్థానిక నేతలు బోర్‌వెల్ చెంగారెడ్డి, లోకేష్‌నాయక్, వెంకటేశు నాయక్, చక్రి, దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

శాంతిపురం: కుప్పం నుంచి కర్లగట్ట మీదుగా కేజీఎఫ్ బస్సు సర్వీసును చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం ప్రారంభించారు. అదే బస్సులో తొలి టికెట్ తీసుకుని ప్రయాణించారు. పీఈఎస్ ఆస్పత్రి, పోడూరు, ప్రీతిచామనూరు, తంబిగానిపల్లె, కర్లగట్ట, రాళ్లబూదుగూరు మీదుగా బస్సు కర్ణాటకలోని కేజీఎఫ్, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో అదే మార్గంలో కుప్పంకు చేరుకుంటుందని వారు చెప్పారు. తమకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరడంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ఆర్టీసీ సర్వీసును కర్లకట్టలో ఎంపీ, ఎమ్మెల్సీ ప్రారంభించారు.



కుప్పం రూరల్ : అనిమిగానిపల్లెలో ప్రగతి బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భరత్, చైర్మన్

జగనన్న గెలుపు చాలా అవసరం

కుప్పం రూరల్: రాబోవు ఎన్నికల్లో జగనన్నతోపాటు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు చాలా అవసరమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 5, 6 వార్డులు తంబిగానిపల్లె, అనిమిగానిపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.66 కోట్లను మంజూరు చేశారని, దశల వారీగా పనులు చేస్తున్నామన్నారు. తమకు అండగా ముఖ్యమంత్రి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని, పేదల కోసం ఏ పని అడిగినా ఇట్టే చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జయంతి, రంగన్న, రాజ్‌కుమార్, మునిరాజు, మోహన్, సయ్యద్ ఆలీ, జగన్, అరవింద్, అరుల్, సర్దార్ భాష, కుమరేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకే 'పల్లె నిద్ర'

గుడుపల్లె: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కేఆర్‌జే భరత్ తెలిపారు. శుక్రవారం యామగానిపల్లెలో ఆయన «పల్లె నిద్ర» నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రాత్రి అక్కడే బస చేశారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు క్రిష్ణమూర్తి ఏడీఎస్ శరవణ, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ ఈశ్వర్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన

పెద్దపంజాణి: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వాటి ఆవశ్యకతపై కోగిలేరు సర్పంచ్ రమేష్‌బాబు శుక్రవారం మండలంలోని పొట్టగానిపల్లెలో మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తోందని, ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.15 వేలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఇలాంటి పథకాలు అమలు చేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పీఎస్ మనోహర్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆదర్శప్రాయుడు



పుంగనూరులో ఉయ్యాలవాడ జయంతి వేడుకలు

పుంగనూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆదర్శప్రాయుడని పలువురు కీర్తించారు. శుక్రవారం రెడ్డి జన సంక్షేమ సంఘ నాయకులు, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, డాక్టర్ శరణ్, సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 218వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. నాగరాజారెడ్డి మాట్లాడుతూ, ఉయ్యాలవాడ బ్రిటిష్‌వారికి ఎదురొడ్డి, పోరాడిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడని స్మరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడన్నారు. పట్టణంలో ఆయన పేరున యుఎస్‌ఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సహకారంతో కరోనా కాలం నుంచి రెడ్డి సంఘం ఉయ్యాలవాడ పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కళాకారులకు, విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జయరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, త్రిమూర్తిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, లలితమ్మ, బాల చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



గీతా మెహతా మృతదేహం

గంగవరం: సంతానలేమితో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం.. హరియాణా రాష్ట్రం మార్వాడిలకు చెందిన అవినాష్(లలిత్), గీతా మెహతా(41)కు పదేళ్ల క్రితం ఆ రాష్ట్రంలోనే వివాహమైంది. ఆమెకు సంతానం లేదు. కొన్నేళ్లుగా బెంగళూరు, పరిసర ప్రాంతాల్లో పలు వ్యాపారాలు, హోటళ్లు నిర్వహించారు. కొన్నాళ్ల క్రితం ఆలకుప్పం వద్ద కొంత పొలం కొనుగోలు చేసి అక్కడే చిన్న రేకుల ఇల్లు నిర్మించుకున్నారు. పలువురికి మూర్ఛ, పక్షవాతం తదితర జబ్బులకు ఆయుర్వేద మందులు సైతం ఇచ్చేవారు. దంపతులిద్దరూ పనిపై ఢిల్లీకి వెళ్లి రెండు రోజులు క్రితం తిరిగి వచ్చారు. భర్త పనిపై కోలారుకు వెళ్లగానే తనకు సంతానం కలగలేదనీ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

అధికారుల చేతివాటంపై విచారణ

- మరో 12 మందికి కూడా అక్రమంగా ఇంటి పట్టాలు ఇచ్చారు!
- టీడీపీ పాలనలో కాలనీ నిర్మాణానికి భూములిచ్చిన ఎస్టీలకు మొండిచెయ్యి
- ఆర్డీఓను ఆశ్రయించి గోడు నివేదించిన బాధితులు

సాక్షి ఎఫెక్ట్..

కుప్పం: తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు అవినీతి, అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'దర్జాగా ప్రభుత్వ స్థలాల విక్రయం!' శీర్షికతో ప్రచురించిన కథనం చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అమరావతి కాలనీ ఎదుట రెవెన్యూ శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఒకే కుటుంబంలో నలుగురికి ఇంటి పట్టాలు ఇవ్వడం, ఆ నాలుగు ప్లాట్లలో భవన నిర్మాణానికి ఓ వ్యక్తి పూనుకోవడం విదితమే. ఇక్కడే మరో 12 మందికి సైతం గుట్టుగా పట్టాలు ఇచ్చినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల నడుమ తీవ్ర స్థాయిలో వాదులాట జరిగినట్టు తెలిసింది. తాము అప్పట్లో నాలుగు ఇళ్ల పట్టాలు ఇస్తే..ఇప్పుడు మీరు 12 మందికి పట్టాలు ఇచ్చారుకదా!? అని గొడవ పడినట్టు సమాచారం. అమరావతి కాలనీ ఎదుట ఉన్న 2 ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని అధికారులు ప్లాట్లుగా దొడ్డిదారిన అమ్ముకున్నట్టు ప్రచారంలోకి వచ్చింది.

అంతా రెండేళ్ల క్రితమే..

మున్సిపాలిటీలోని అమరావతి కాలనీ ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని రెండేళ్ల క్రితం అధికారులు గుట్టుగా ఇళ్ల పట్టాల రూపేణా పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి నాలుగు ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు వెలుగులోకి రావడంతో కొత్తపేట, అనిమిగానిపల్లె, వెండుగంపల్లె వాసులు 12మందికి సైతం పట్టాలు ఇచ్చినట్లు పరస్పర ఆరోపణలతో ఉద్యోగులు తమ బాగోతమేమిటో చాటుకున్నారు.

మాకు న్యాయం చేయరూ!

తమ అనుభవంలో ఉన్న భూములను పదేళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అమరావతి కాలనీ కోసం ఇచ్చామని, తమకు న్యాయం చేయాలని ఆర్డీఓ జీ.శ్రీనివాసులకు ఎస్టీ కాలనీ వాసులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. పలార్లపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 115-4లో 0.94 ఎకరాల భూమిలో తాము వ్యవసాయం చేసేవాళ్లమని, కాలనీ నిర్మాణం కోసం అప్పట్లో ఈ భూములను ప్రభుత్వం తీసుకుందని, నష్ట పరిహారం ఇస్తామని, అలాగే ప్రతి ఒక్కరికీ ఇంటిని మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చి మోసం చేశారని వారు ఆరోపించారు. ఇప్పుడు అదే భూముల్లో ఖాళీ స్థలాలను అధికారులు అమ్ముకోవడం శోచనీయమని, భూములు కోల్పోయిన తమకు ఇంటి స్థలాలైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

దొంగకు దేహశుద్ధి



అస్లాం

గుడుపల్లె: మద్యం మత్తులో రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తి వద్ద నగదు చోరీ చేసిన వ్యక్తిని కొండ సముద్రం గ్రామస్తులు చితకబాదారు. వివరాలు..తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె సమీపంలోని కొత్తక్రిష్ణేపల్లెకు చెందిన అస్లాం రోజూ రోడ్డుపై పేపరు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని వాటి విక్రయంతో జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం పేపర్లు ఏరుకుంటున్న సమయంలో మద్యం తాగి రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తి వద్ద నుంచి రూ.9 వేలు దొంగలించాడు. ఇది గుర్తించిన స్థానికులు అస్లాంను పట్టుకుని అక్కడే ఉన్న ఉన్న సూచిక బోర్డుకు కట్టేసి చితకబాదారు. దీంతో అతను ఎక్కడెక్కడ ద్విచక్రవాహనాలు, డబ్బులు దొంగలించాడో చిట్టా విప్పాడు. సమాచారమివ్వడంతో గుడుపల్లె పోలీసులు అస్లాంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఈఓకు విరాళమిస్తున్న దాత

చౌడేపల్లె: శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమలకు చెందిన ఎస్.శంకరప్ప, విద్యారాయల్ కుటుంబ సభ్యులు రూ:15 వేల విరాళాన్ని శుక్రవారం ఈఓ చంద్రమౌళికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు ఈఓ ప్రసాదాలు అందజేశారు.

డ్వాక్రా మహిళలపై కేసు

సోమల: డ్వాక్రా సంఘ సభ్యులైన కమ్మపల్లెకు చెందిన సుజాత, అమరావతి, మమత, అమ్ములు, సులోచనపై సాయిరాం గ్రూపు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లెకు చెందిన పైవారు సుమారు 6 నెలల క్రితం వీఓ పుస్తకాలు తీసుకుని మోసం చేయాలనే ఉద్దేశంతో తిరిగి వాటిని ఇవ్వలేదని సంఘమిత్ర, సభ్యులు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా నిందితులపై కేసు నమోదు చేశారు.

గంగమ్మకు వెండి త్రిశూలం సమర్పణ



త్రిశూలాన్ని ఈఓకు అందజేస్తున్న దాత

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు బెంగళూరుకు చెందిన కె.వెంకటేశ్వరరావు సుమారు రూ.లక్ష విలువచేసే వెండి త్రిశూలాన్ని శుక్రవారం సమర్పించారు. దీనిని జమీందార్ వంశస్తులు, ఆమినిగుంటకు చెందిన రమేష్ రాయల్ ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళికి అందజేశారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి త్రిశూలంతో అలంకరణ చేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బోయకొండ కమిటీ మాజీ సభ్యుడు ఠాణాదార్ నాగరాజ, రఘుస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం



పుంగనూరు: కరపత్ర ప్రచారం చేస్తున్న చైర్మన్



చౌడేపల్లె: 29ఏ చింతమాకులపల్లెలో..



సోమల: అన్నెమ్మగారిపల్లెలో..



సదుం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



పులిచెర్ల: కమ్మపల్లెలో కరపత్ర ప్రచారం

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేయాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అభ్యర్థించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. గ్రామ కూడలిలో పార్టీ నేతలతో కలసి జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు జయభారతి, రేష్మ, సాజిదాబేగం, కమలమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరాం, కన్వీనర్ వరదారెడ్డి, పార్టీ నాయకులు అహమ్మదాలి, తేజ, ఖాన్, రాజేష్, సురేష్, అస్లాం, మహబూబ్‌బాషా, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరడిగుంటలో..

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంటలో శుక్రవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి , బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి నిర్వహించారు. సచివాలయంలో డిజిటల్ బోర్డు, గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ నంజుండప్ప, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని 29-ఏ చింతమాకులపల్లెలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తితో కలిసి నిర్వహించారు. ప్రగతి బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సర్పంచ్ హైమావతి, ఎంపీటీసీ శ్రీరాములు నేతలు గిరి రెడ్డి, రవికుమార్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నెమ్మగారిపల్లెలో..

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె సచివాలయ పరిధిలో సర్పంచులు వనజమ్మ, విమల ఆధ్వర్యంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి..డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యురాలు సర్వేశ్వరమ్మ, పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వేముల హరినాథ, మాజీ ఎంపీటీసీలు జిలాని, శ్రీరాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, ఉప సర్పంచ్ సూర్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు బాలచంద్రారెడ్డి, గురుప్రసాద్, సోషల్ మీడియా నియోజకవర్గ కో-కన్వీనర్ షేక్ బాషా పాల్గొన్నారు.

ఊటుపల్లెలో..

సదుం: మండలంలోని ఊటుపల్లె సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి నిర్వహించారు. పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డు, కరపత్రాలను ఆవిష్కరించారు. సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, నాయకులు హేమసుందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సీతాపతి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్మపల్లె, జ్యోతినగర్‌లో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి నిర్వహించారు. ఎంపీపీతోపాటు పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. జ్యోతి నగర్‌లో ఎంపీటీసీ పోకల చంద్ర ఇంటింటా ప్రచారం చేశారు. జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా, వైస్ ఎంపీపీలు రాశిప్రసాద్, ఈశ్వరి, సర్పంచ్ నాగరాణి, నాయకులు రవీంద్రారెడ్డి, గోవర్ధన్, నాగిరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



విశాఖపట్నం-నెల్లూరు బాలుర జట్ల మధ్య కబడ్డీ పోటీ

- గుంటూరు, విశాఖ, తూర్పుగోదావరి, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జట్లు శుభారంభం



తూర్పుగోదావరి-చిత్తూరు జట్ల నడుమ పోటీ



విజయనగరం- ప్రకాశం బాలికల జట్ల పోటీ

చౌడేపల్లె: అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో గుంటూరు, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లా జట్లు శుభారంభం చేశాయి. శుక్రవారం రాత్రి స్థానిక జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ప్రేక్షకుల కేరింత నడుమ ఉత్కంఠభరితంగా ఈ పోటీలు సాగాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు తలపడ్డారు.

బాలుర విభాగంలో తొలిరోజు గెలుపొందిన జట్లు

బాలుర విభాగంలో తొలుత కర్నూలుపై గుంటూరు జట్టు 38-55 పాయింట్లు తేడా సాధించి విజయం సాధించింది. అలాగే నెల్లూరు జట్టుపై విశాఖపట్టణం 39-60 తేడాతో గెలుపొందింది. అనంతరం తూర్పుగోదావరిపై చిత్తూరు జట్టు విజయం సాధించింది.

బాలికల విభాగంలో..

బాలికల విభాగంలో కృష్ణా జట్టుపై తూర్పుగోదావరి 51-62, విజయనగరంపై ప్రకాశం 27-30 పాయింట్ల తేడా గెలిచాయి. అనంతరం విశాఖపట్టణంపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. పలు గ్రామాల నుంచి ప్రజలు, క్రీడాభిమానుల రాకతో చౌడేపల్లెలో క్రీడా సందడి నెలకొంది. పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మల్‌రెడ్డి, క్రీడల అబ్జర్వర్ రామ్‌బాబు, పీడీలు వెంకటేష్, నితిన్, అజయ్, రాజేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా ప్రయాణికులకు సేవలు

- పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంబరాలు
- అసోసియేషన్‌కు గుర్తింపు లభించడంపై హర్షం
- టపాసులు పేల్చి ఉద్యోగుల సందడి
- సీఎంకి రుణపడి ఉంటామన్న నేతలు



సంబరాలు నిర్వహిస్తున్న అసోసియేషన్ నేతలు

పలమనేరు: ప్రభుత్వ ప్రజారవాణా శాఖలో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు లభించడంపై ఆశాఖ పలమనేరు నేతలు స్థానిక డిపో వద్ద శుక్రవారం సంబరాలు నిర్వహించారు. భారీగా టపాసులు కాల్చారు. స్వీట్లు పంచారు. అసోసియేషన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రమణ, ఉపాధ్యక్షులు ఈ.బాలక్రిష్ణ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా సంస్థగానే ఉన్న ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన మాట కోసం కట్టుబడిన జగనన్న తమ కుటుంబాల్లో వెలుగులు నింపారని, ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎం దేశంలోనే లేరన్నారు. సీఎం నిర్ణయం వల్ల ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలు చాలా సంతోషంగా ఉన్నాయని, తమ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు హోదానివ్వడంతో తమపై గురుతర బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంతో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడతామని, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యూనియన్ నేతలు వీపీ రెడ్డి, కార్యదర్శి గణేష్, వరదయ్య, రవి, జీఎంఎం రెడ్డి, రెడ్డెమ్మ, బాబు, మధు, శేఖర్, షఫి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ: ఎంపీపీ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: గ్రామాల్లో సమస్యలపై ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించి పరిష్కారానికి చొరవ చూపాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలానికి 28 ఆలయాలు మంజూరయ్యాయని, వీటిలో 8 పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన వాటిని వెంటనే ప్రారంభించాలన్నారు. హౌసింగ్ శాఖపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి విస్తృత ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అమరావతి, ఎంపీడీఓ వరప్రసాద్, డీటీ కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల వాహనం బోల్తా

-డెలివరీ బాయ్‌కు తీవ్రగాయాలు

పెద్దపంజాణి: ఇండేన్ గ్యాస్ సిలిండర్ల వాహనం బోల్తా పడి డెలివరీ బాయ్‌కు తీవ్రగాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పెద్దపంజాణి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. పలమనేరు నుంచి మండలంలోని పెద్దవెలగటూరులో గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ చేసేందుకు అశోక్ లైలాండ్ దోస్త్ వాహనం వెళ్తూ మార్గమధ్యంలోని పుంగనూరు-అప్పినపల్లె రహదారిలోని క్వారీ మలుపులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలమనేరు మండలం టి. వడ్డూరుకు డెలివరీ బాయ్ వినోద్ కుమార్(19) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో క్షతగాత్రున్ని కుటుంబీకులు వేలూరు సీఎంసీకి తరలించారు. శుక్రవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.